పేదలకు 'పట్టా'భిషేకం



రామభద్రపురంలో ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అర్హులైన పలువురు రామభద్రపురం గ్రామస్తులకు ఇళ్లపట్టాలు, మరికొంతమంది రైతులకు భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో తొలుత గ్రామంలోని 409 మందికి, ఇప్పుడు మరో 116 మందికి ఇళ్లపట్టాలు అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతీ పేదవాడు సొంతింటిలో సుఖసంతోషాలతో ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు, తహసీల్దార్ సులోచనారాణి, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక సచివాలయం–3 పరిధిలో శనివారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామీణులకు కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు.

రామభద్రపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును ఎస్ఐ జ్ఞానప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్ఐను ఎమ్మెల్యే కోరారు.

బొబ్బిలి: మండలంలోని రాముడువలస గ్రామంలో పలువురు రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరించండి

రాజాం: ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. మండలంలోని రాజయ్యపేట, కంచరాం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన పలువురు పార్టీ నేతలతో సమావేశమై, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు అన్నివిధాలా ప్రయోజనం చేకూరిందని, ఇదే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే ప్రధానంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు ఎల్. రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం ప్రారంభించారు. కాబోతుల పార్వతి జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాబోతుల శ్రీనివాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో పార్టీ శ్రేణులతో సమావేశమైన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

బీసీ కాలనీకి రోడ్డు ఏర్పాటు

బాడంగి: మండలంలోని రావివలస బీసీ కాలనీకి కొత్తగా ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. 1984 నుంచి ఇక్కడి కాలనీకి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదే విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామం విచ్చేసిన సదరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సత్వరమే రోడ్డు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత ఎస్.వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు పాల్గొన్నారు.



రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రూ.30.57 కోట్లతో అభివృద్ధి పనులు

బొబ్బిలి: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లాలోని బొబ్బిలి, గజపతినగరం, రాజాం నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.30.57 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో ఆయా నియోజకవర్గాల్లో 986 పనులకు గాను 817 పనులు ప్రారంభం కాగా ఇప్పటివరకు 301 పనులు పూర్తయ్యాయి. వీటిలో 133 పనులకు సంబంధించి, రూ.3.67 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఎప్పటికప్పుడు ఈ పనులపై ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్న నేపథ్యంలో పనులు చకచకా జరుగుతున్నాయి. ఓ వైపు పనులు జరుగుతుండడంతో స్థానికులు, మరోవైపు జరిగిన పనులకు త్వరితగతిన బిల్లులు చెల్లిస్తుండడంతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాడంగి మండలంలోని లక్ష్మీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో ఓ ఫంక్షన్ హాల్ ముందు వేసిన సీసీ ప్లాట్‌ఫాం

మాడ్యూల్‌లో మార్పులు..

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తయిన పనులకు సంబంధించి, సత్వరమే బిల్లుల చెల్లింపు జరిగేలా ప్రభుత్వం మాడ్యూల్‌లో మార్పులు తీసుకువచ్చింది. అన్నిచోట్ల పనులు జరుగుతుండడంతో బిల్లుల అప్‌లోడింగ్ సమస్య ఎక్కువైంది. ఈ క్రమంలో బిల్లుల అప్‌లోడ్ సాఫీగా జరిగేలా మాడ్యూల్‌లో సరికొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో బిల్లుల అప్‌లోడింగ్ చకచకా జరుగుతున్నాయి. మరో వారంలో మిగతా పనుల బిల్లులు కూడా చెల్లించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



శ్వేతాచలపతి స్కూల్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్

విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య

బొబ్బిలి: విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందిస్తున్నామని శ్వేతాచలపతి సంస్థానం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సుశిక్షితులైన బోధనా సిబ్బందితో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. స్టూడెంట్ అడాప్షన్ విధానం అవలంభిస్తూ చదువులో వెనకబడిన ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ వారి విద్యాప్రగతికి కృషి చేస్తున్నామన్నారు. టాటా గ్రూప్ ద్వారా ఎర్లీ ఎడ్జ్ విధానం అమలుచేస్తూ రాజస్థాన్ కోట నుంచి ఐఐటీ, జేఈఈ, నీట్ కోర్సులను అందజేస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఐఐటీ, ఎంబీబీఎస్‌కు వెళ్తున్న విద్యార్థుల్లో ఇదే విద్యాసంస్థ నుంచి అధికంగా ఉంటున్నారన్నారు.

అనతికాలంలోనే 'విజన్'కు మంచి గుర్తింపు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని విజన్ అకాడమీకి అనతికాలంలోనే మంచి గుర్తింపు లభించిందని అకాడమీ డైరెక్టర్ వి.ఎస్.చలం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఐటీ, జేఈఈ, ఎం–ఈఏఈటీ, నీట్ పరీక్షల్లో కోచింగ్ ఇస్తున్న ఈ అకాడమీ ఏర్పాటైన రెండేళ్లలోనే ఎన్నో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ఎంతోమంది విద్యార్థులను దేశంలోనే గొప్ప పేరొందిన విద్యాసంస్థలకు అందించిందన్నారు. ఇప్పటివరకు ఆలిండియా స్థాయిలో ఐఐటీలో 515, జేఈఈలో 2,638, ఎం–ఈఏఈటీలో 2,121 అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

ఇదే అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థుల్లో ఎన్ఐటీలో ఐదుగురు, ట్రిపుల్ ఐటీలో ఒకరు, సెంట్రల్ యూనివర్సిటీలో ఇద్దరు, జేఎన్‌టీయూలో నలుగురు విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. అకాడమీ పెట్టిన కొంతకాలానికే అత్యుత్తమ ర్యాంకులు వస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు.



విజన్ అకాడమీ వ్యవస్థాపకుడు చలం

చంద్రబాబు పచ్చి మోసగాడు

బొబ్బిలి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పచ్చి మోసగాడు అని, ఎన్నికల వేళ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి అనూరాధ విమర్శించారు. ఇదే విషయమై ఆమె శనివారం సాక్షి విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, అందుకే వెబ్‌సైట్ నుంచి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో–2014ను తొలగించారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ఓ భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి, అందులో పేర్కొన్న అన్ని హామీలు నెరవేరుస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం ఒక్క సీఎం జగనన్నతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలోని ఏ వర్గం ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

సంక్షిప్తంగా...

అర్హతే ప్రామాణికంగా పథకాలు



రాజాం సిటీ: పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం సిటీ: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బోడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీటీసీ ధర్మాన పద్మావతి, సచివాలయ కన్వీనర్ పొన్నాడ సన్యాసినాయుడు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



రాజాం: మారేడుబాకలో అక్షతలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్

రాజాం: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, మండలంలోని మారేడుబాక, కొత్తవలస గ్రామాల్లో రాముడికి పూజ చేసిన అక్షతలను శనివారం పంచిపెట్టారు. వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం భక్తులు ఇంటింటికీ వెళ్లి, అక్షతలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మెంటాడ: మండలంలోని చల్లపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో శతశాతం మౌలిక సదుపాయాలు కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

రాజాం: మండలంలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ప్రభుత్వం



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

బొబ్బిలి: పారిశుద్ధ్య కార్మికులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్మికుల మస్తరు కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, తువ్వాళ్లు శనివారం అందజేశారు.

దుస్తుల వితరణ

తెర్లాం: మండలంలోని పాములవలస, ఆమిటి గ్రామాల్లోని పలువురు నిరుపేదలకు రాజాం జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు వితరణ చేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.